# జ్యోతి - మార్గదర్శి

"ఒరే బుజ్జిగా ఏం చేస్తున్నావురా అక్కడ," అని అరుస్తూ ఇంట్లోకి వచ్చారు మా నాన్నగారు. వసారాలో ఉన్న నేను ఆ కేకకు అదిరిపడ్డాను. ఏం చెప్పను. అలా చెప్పితే మానాన్న నన్ను ఉతికేయరూ! గుప్‌చుప్‌గా నే రాస్తున్న కథ తాలూకు కాగితాలు పుస్తకాలమధ్య పెట్టి సైన్సు పుస్తకం తీసికొని చదువుతున్నాను.

"ఏరా వెధవ! ఏం చేస్తున్నావంటే పలకవేం" అంటూ గర్జించి అడిగారు. నా ప్రాణాలు అమాంతంగా పైకి ఎగిరిపోయాయి. చమటలు పట్టేస్తున్నాయి. దేవుడు దగ్గరయినా అబద్ధం చెప్పి తప్పించుకోవచ్చుగాని మా నాన్న దగ్గర మాత్రం అది కుదరదు.

"ఏమే వీడు చదువుతున్నాడా అసలూ" అంటూ వంటింట్లో వున్న మా అమ్మని పిలిచి అడిగారు. మా అమ్మ నా పార్టీనే కాబట్టి,

"ఏదో రాసు కొంటున్నట్టున్నాడు, మీరు ఇంతగా వాడిని కేకలేస్తే భయపడి పోతాడు కుర్ర నాగన్న" అని సుకుమారంగా సమాధానం చెప్పింది.

"అసలు వీడినికాదే అనడం. విన్ను....విన్ను అనాలే. ఇలాగయితే అసలు వీడు ఈ సంవత్సరం పాసవుతాడాఅంట! ఎస్. ఎల్. సి పరీక్షలంటే మాటలంటే!" అంటూ,

"ఒరే బుజ్జిగా ఇలా రా" అని దూరంగా ఉన్న నన్ను రమ్మనమన్నారు. బిక్కుబిక్కుమంటూ మా నాన్నగారి సమక్షానికి వచ్చి నిలబడ్డాను. చలనంలేదు నాలో. జరగబోయే పరిస్థితి తలచుకోగానే....మన తెలుగు సినిమాలో మాదిరిగా నా శరీరంలో తుఫానులు, భూకంపాలు, రైళ్ళు గుద్దుకోవడం లాంటివి జరిగాయి. నాయెదుట ఉన్న అమ్మా, నాన్న, కుర్చీ, స్థంభం నా కంటికి మసక మసకగా కనబడుతున్నారు. కళ్లు తిరుగుతున్నాయో, నేనే తిరుగుతున్నానో గమనించలేకపోయాను.

---

విద్యార్థుల చిన్నకథల పోటీలో

మొదటి బహుమతి రూ. 50

జి. నాగేశ్వరరావు,

[బి. ఎస్. సి. (ఎమ్. పి. సి.) ఫస్టియర్. మిసెస్ ఎ. వి. ఎన్. కాలేజి, విశాఖపట్నం.]

"ఏరా వెధవా! దిష్టిబొమ్మలా నిలబడ్డావే" అనేసరికి నా మత్తు, మస్తు కయినా లేకుండా నన్ను వదిలిపోయింది.

"నీకు పరీక్షలు ఎప్పటి నుంచి?"

"మార్చి ఏడునుంచి."

"ఏడుపు మొహం పెట్టుకొని ఇలాగే ఏడుస్తావా, చదువుదామని ఉద్దేశ్యం ఏదైనా ఉందా."

"ఉంది."

"ఐతే ఇప్పుడు రాస్తున్నది ఇలా తీసుకురా"

నేను అనుకొన్నట్టు గానే జరిగింది. ఇక లాభంలేదు. తప్పు ఒప్పుకొని, పెట్టబోయే ఆ రెండు చివాట్లు తిని ఇక శ్రద్ధగా చదువుకోవా లనుకున్నాను. నన్ను ఈ కొంపలో పుట్టించిన బ్రహ్మని చాలావరకు తిట్టాను. అసలు విషయం ఏమంటే నాకు చిన్నప్పటి నుంచి కథలు రాయాలని పిచ్చి. అందులో "జ్యోతి" మొదలయిన పుస్తకాలలో మా విద్యార్థులకు పెట్టిన పోటీల లాంటివి అంటే నాకు ఎక్కడ లేని ధైర్యం వచ్చింది. కాని ఏం లాభం. నాలో అజ్ఞాతంగా ఉన్న ఈ ఉత్సాహాన్ని ఎన్నాళ్ళిలా దాచుకోను మీరే చెప్పండి. కాకినాడ వెళ్తానని చెప్పిన మా నాన్న అమాంతంగా మనసు - మార్చుకొని ఇంటికి వస్తారనీ, నన్ను ఇలా నిలదీసి అడుగుతారనీ కలలోకూడ అనుకోలేదు. సరే ఏమనుకొని ఏం లాభం. నేను రాసిన ఆ నాలుగు కాగితాల కథని వరుసలో పెట్టి మా నాన్న దగ్గరికి దారి తీసాను.

"పదడుగులు నడవడానికి పది నిమిషాలు కావాలట్రా నీకు" అని నామీద మండి పడ్డారు. ఇలాంటిచిన్నవి (తిట్లు) నాకు రోజూ అనుభవమే కాబట్టి అది నాకంత ఎఫెక్టు కలిగించలేదు.

"రాసింది ఇలాగియ్యి" అని చేతులలోని కాగితాలు తీసికొని, "ఆ బల్లమీద కళ్ళజోడు అందుకోరా" అని పురమాయించారు. కీ ఇచ్చిన యంత్రంలా వెళ్ళి తెచ్చి ఇచ్చాను. ఒక్కొక్క అక్షరమే చదువుతున్నారు. నా కూ ఒక్కొక్క క్షణమే దగ్గర పడుతోంది. మా అమ్మ మా ఇద్దరివైపు వింతగా చూస్తోంది. బహుశా మా నాన్న గారి ఎదుట ఇంతసేపు నేను నిలబడటమే కావచ్చు, సగం చదివినట్టుగా రెండు కాగితాలు పూర్తి అయ్యాయి. ఆ క్షణంలో నేను మ్రొక్కని దేముడూ, తలవని పుణ్యక్షేత్రము లేదనుకోండి. యథా ప్రకారంగా చెమటలు ఆటోమాటిక్‌గా నా తనువంతా వ్యాపించాయి. తలెత్తి మా నాన్నగారి ముఖంలోకి మొదటిసారి సూటిగా చూశా. నేను

రాసిన కథను మడతపెట్టి జేబులో పెట్టుకున్నారు. కళ్ళజోడు తీసి బల్లమీద పెట్టారు. అమ్మా, నేనూ మా నాన్నని గమనిస్తూనే ఉన్నాం. అంతే! ఒక్క క్షణం నిశ్శబ్దం. మా నాన్నగారు పెంకులు ఎగిరిపోయేలా.... నవ్వేరు. ఆ నవ్వుకి అంతులేదు. బాగుండదు కదా అని నేనూ, మా అమ్మా కడుపుబ్బ నవ్వాం.

"నోరు ముయ్యండి రాస్కెల్స్ నేను కథ బాగుంది నవ్వుతోంటే మీరూ నవ్వుతారట్రా ?" అంటూ మా మీద విరచుకు పడ్డారు.

"ఒరే అబ్బాయి" అని దగ్గరకు పిలిచారు. ఆ కంఠంలో మునుపెన్నడూ లేని ఆప్యాయత ఉంది. వెళ్ళి పక్కన నిలబడ్డాను.

"కథ చాలా బాగా రాసావు. నీకింత తెలివితేటలు ఉన్నాయని నాకు ఇప్పటికీ నమ్మకం కలగడం లేదు. తప్పకుండా ఈ కథ "జ్యోతి"లో వేసుకొంటారబ్బాయి. కాని నువ్వుమాత్రం పప్పులో అడుగు వేశావురా" అని అన్నారు.

"ఎందుకు ? ఎలా ?" అన్నట్టు పోజు పెట్టాను.

"వెర్రి నాన్న....జ్యోతిలో నీ కథ పడాలని ఉంటే నీకు ఈ ఎస్. ఎస్. యల్. సి. చదువు చాలదురా. నువ్వు కాలేజి విద్యార్థివి కావాలి. ఆ పోటీ ఒక్క కాలేజి కుర్రాళ్ళకేరా" అని నా భుజం తట్టారు.

అంతే నాలో నేను నిర్మించుకొన్న ఆశాసౌధాలు ఒక్కసారిగా కూలిపోయాయి. "ఇక నేనూ నా కథ ఏం కావాలి ? తప్పకుండా శ్రద్ధగా రాయాలి. రాయాలి. తప్పకుండా వేసుకొంటారు. బహుమతి వస్తుంది. తప్పకుండా వస్తుంది." అని నాలో నేను అనుకొన్నా.

* * *

ముసలమ్మ నడకలాగ ఆ మూడు నెలలు గడిచాయి. నేను ఫస్టు మార్కులతో ప్యాసయ్యాను నాన్నగారు కాలేజీలో చేర్పించారు. అంతే నేనిప్పుడు కాలేజివిద్యార్థిని అన్న మాట. నేను చదివిన చదువుకు ఫలితం దక్కింది. నేను రాసిన కథకు తగిన శుభ సమయం వచ్చింది. ఇప్పుడు 'జ్యోతి'కి కథ రాయడానికి తగిన అర్హత నాకు ఉంది కదా. అందుకే ఇప్పుడే నా కథ కథగారాసి 'జ్యోతి'కి పంపిస్తున్నా.

నన్ను బాగాచదివేట్టు చేసి, కాలేజిలో చేరడానికి ప్రోత్సహించిన 'జ్యోతి'కి నా కృతజ్ఞత.

***